# ‘వాయిదాల రిపేరు’

లేచాను.. అలస్యంగా నిద్రలేచాను. ఆ గడియారాన్ని నమ్ముకుంటే అంతే మరి. నెలకి ఒక ట్రెండుసార్లు వీధి చివర్నుండే వాచ్‌రిపేర్ మస్తాన్‌కి పదో పరకో సమర్పించడానికి తప్ప దానివల్ల ఏమీ ఉపయోగం లేదు.

అలా అని దాన్ని మూసీ నదిలో పడేసి కొత్తది కొందామంటే మధ్యతరగతి మనస్తత్వం ససేమిరా అంటోంది.‘ ఇక లాభంలేదు ఈసారి మెకానిక్‌ని మార్చాల’నుకుని, దాన్ని మా ఆఫీసు దగ్గర్లోవున్న నర్సిం దగ్గరకి తీసుకెళ్ళాను.



రిపేరు చేయడానికి నూటయాభై రూపాయలు ఇవ్వమన్నాడతను. పైసా కూడా తగ్గనని మొహమాటం లేకుండా చెప్పాడు. చేసేదేంలేక రిపేర్‌కి ఇచ్చి.. సాయంత్రం కొలీగ్ దగ్గర డబ్బు అప్పుతీసుకుని నర్సింకిచ్చి గడియారాన్ని ఇంటికి తెచ్చుకున్నాను.

మూడు నెలలయింది. అది కొత్తగడియారంలా అద్భుతంగా పనిచేస్తోంది. దాని పనితనానికి అబ్బురపడ్డాను. ఇన్నాళ్ళూ మస్తాన్ చేసిన మోసానికి కోపంతో కుతకుతలాడిపోతూ వడివడిగా వెళ్ళి అతన్ని నిలదీశాను.

దానికి అతను నవ్వుతూ “అయ్యా! మీరు రిపేర్ చేయించడానికి వచ్చినప్పుడల్లా గీసిగీసి బేరమాడుతూ పదో, పరకో చేతిలో పెట్టేవారు. నేను దానికి తగ్గట్టుగా ఇన్‌స్టాల్ మెంట్ రిపేర్ చేసేవాణ్ణి.. నాక్కూడా మొదటే అడిగినంత ఇచ్చేసినట్టయితే స్టాండర్డ్‌గా చేసేవాణ్ణి. మీలాగా నేనూ బతకాలి కదండీ” అన్నాడు.

ఎస్! మీరూహించినట్టుగానే వుంది.. అప్పటి నా ముఖం!

**–ప్రతాప వెంకట సుబ్బారాయుడు,**
సికింద్రాబాద్